ధ్వజాలు. ఆ పార్టీ ఎందుకు పుట్టింది? ఎలా పుట్టింది? అనే కోణంలోనూ ఆలోచించాలి.

బీఆర్ఎస్.. నూటికి నూరుశాతం ఉద్యమ పార్టీ. పోరాటమే తన పంథా అని ప్రకటించుకున్న పార్టీ. ఒక్కడితో మొదలై.. లెక్కకు మిక్కిలి ప్రజా సైన్యంతో తెలంగాణ నలుదిక్కులా విస్తరించింది. స్వరాష్ట్ర ఆకాంక్ష కోసం.. లాఠీ దెబ్బలు తిన్నది. జైలుకెళ్లింది. ఊచలు లెక్కబెట్టింది. తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి నిలిచింది. పదవుల్ని గడ్డిపోచలా భావించింది. అదే గడ్డిపోచల్ని ఏకం చేసి మదపుటేనుగును బంధించింది. రాజీనామాలతో జనక్షేత్రానికి వెళ్లింది. ఎక్కడా రాజీలేదు. ఏ విషయంలోనూ మడమతిప్పలేదు. పార్టీ అంటే అలా ఉండాలి!



తొలిదశ తెలంగాణ ఉద్యమం గొంతునొక్కిన ఓ జాతీయ పార్టీ.. తెలంగాణ పీఠం ఎక్కాలని ఉవ్విళ్లూరుతున్నది. విఫల ప్రయత్నాలు చేస్తున్నది. వందేండ్లు నిండిన ఆ పార్టీని ప్రధాన రాష్ర్టాలన్నీ బొందబెట్టాయి. కాస్తంత దయచూపిన కన్నడిగులది ఇప్పటికే కన్నులొట్టబోయిన పరిస్థితి. ఐదారు నెలల్లోనే ఐదేండ్ల నరకం చూపిస్తున్నారు. అంతర్గత కుమ్ములాటలతో ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేస్తున్నారు. దేశమంతా వద్దనుకున్న గద్దల పార్టీ మనకు మాత్రం ఎందుకు?

ప్రస్తుతం దేశాన్ని ఏలుతున్న పార్టీకి తెలిసిందల్లా ఒకటే.. జనాన్ని విభజించి.. దేశాన్ని భుజించడం. రాజకీయ ఉద్యోగాల కోసం ఉద్వేగాలను రెచ్చగొడతారు. దేశ సరిహద్దులు మొదలు మారుమూల పల్లెల వరకు.. ఏ అవకాశం వచ్చినా వదలరు. ఏ అవకాశమూ రాకపోయినా కృత్రిమంగా సృష్టించుకుంటారు. తమ కనుసన్నల్లో మెలిగే పారిశ్రామికవేత్తల సంపద పెంచడమే వీళ్ల ఆర్థిక విధానం. ఎన్నికల సమయానికి సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలను పెంచి పోషించడమే వీళ్ల విదేశాంగ విధానం. బలహీనమైన ప్రభుత్వాలున్న ప్రతి రాష్ట్రంలో పాగా వేస్తారు. చీమలు పెట్టిన పుట్టలను పాములు మింగేసినట్టు.. నయానో భయానో అధికారం చేజిక్కించుకుంటారు. ఇదొక విషవృక్షం. అదొక రక్తబీజుడి సంతతి. మొదట్లోనే కట్టడిచేయాలి. నిర్దాక్షిణ్యంగా తరిమేయాలి. మన రాష్ట్రం. మన పార్టీ. మన అధినాయకుడు. మన ఆత్మాభిమానం.

**మ్యానిఫెస్టో**

మ్యానిఫెస్టో.. ఒక వాగ్దానం. త్రికరణ శుద్ధిగా చేసే ప్రమాణం. ఓటరుకు భరోసా. అందులో నాయకుడి విజన్ ఉంటుంది. పార్టీ కార్యాచరణ ప్రణాళిక ఉంటుంది. మహిళల మనోగతం, నిరుద్యోగుల ఆశలు, రైతుల కలలు, శ్రామికుల స్వప్నాలు, ఉద్యోగుల దీర్ఘకాల డిమాండ్లు.. అన్నీ కలగలిసి ఉంటాయి. అది ఆకలితీర్చే అన్నం గిన్నె. నోరు తీపిచేసే మిఠాయి పొట్లం. అందమైన రేపటికి అక్షర సాక్ష్యం.

మ్యానిఫెస్టోను ఒక బాధ్యతగా భావించే భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) లాంటి పార్టీలు అతి తక్కువ. కేసీఆర్ గత ఎన్నికల మ్యానిఫెస్టోను నూటికినూరు శాతం అమలు చేశారు. మ్యానిఫెస్టోలో ప్రకటించని పథకాలూ అమలు చేశారు. సైకిల్ కొనిస్తానని మాటిచ్చి.. బ్రాండ్ న్యూ బైక్ కానుకగా ఇచ్చే కన్నతండ్రి మనస్తత్వం ఆయనది. కానీ అందరూ అలా ఉండరు. అన్ని పార్టీలకూ అంత ఔదార్యం ఉండదు.

కొందరికి.. మ్యానిఫెస్టో ఓ తెప్ప, ఎన్నికలు అయిపోగానే తగలబెట్టేస్తారు. ఆ విన్యాసాలు సర్కారు ఏర్పాటు కోసం చేసే పీసీ సర్కార్ గారడీలు. కచ్చితమైన అంచనాలు ఉండవు. శాస్త్రీయమైన అధ్యయనం కనిపించదు. యథాతథంగా అమలు చేస్తే మాత్రం.. ఖజానా ఖాళీ. ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమే. ఇలాంటి టక్కుటమార విద్యలలో వందేండ్ల పార్టీ ఆరితేరింది. ఇప్పటికే కన్నడ సీమలో ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక.. నిండుకున్న ఖజానాను నింపుకోలేక పాలకులు బిక్క మొహం వేస్తున్నారు. నక్కజిత్తులు పన్నుతున్నారు. మరొక జాతీయ పార్టీ ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివింది.

కాబట్టి, ప్రతి పార్టీ మ్యానిఫెస్టోనూ పరిశీలించండి. ఆ వాగ్దానాలను గమనించండి. సాధ్యాసాధ్యాలను బేరీజు వేయండి. క్షీరనీర న్యాయం తెలిసిన రాయంచలా.. చిత్తశుద్ధి ఉన్న పార్టీకి, చెత్త బుద్ధి ఉన్న పార్టీకి తేడాను గమనించండి. మంచినే గెలిపించండి.

**అభివృద్ధి**

అంకెలతో పన్లేదు. బడ్జెట్ వివరాలతో నిమిత్తం లేదు. చట్టసభ చర్చల్లో ఎవరో బల్లగుద్ది చెప్పాల్సిన అవసరమూ లేదు. అభివృద్ధి కళ్లకు కనిపించాలి. మనసుకు అర్థం కావాలి. ఆ సానుకూల మార్పు జీవితాల్ని ప్రభావితం చేయాలి. బతుకుల్ని మెరుగుపరచాలి. నిన్న లేని అందమేదో నేడు సాక్షాత్కరించాలి. అంతే.

అప్పుడెట్లుండె తెలంగాణ. ఇప్పుడెట్లయింది తెలంగాణ.
ఎండిన గొంతులు తడుస్తున్నయ్.
మిషన్ భగీరథే సాక్ష్యం.
నెర్రెలు బారిన నేలలు మాగాణాలు అవుతున్నాయి.
కాళేశ్వరమే ఆధారం. సేద్యగాడికి అప్పుల కష్టం తప్పింది.
రైతుబంధు ఆత్మీయ బంధువు.
ఆడపిల్ల తండ్రికి అప్పుల తిప్పల్లేవు. కల్యాణలక్ష్మి కటాక్షించింది.
ఒకటా రెండా.. అనేక పథకాలు.



**జనాభిప్రాయం**

జనవాక్కు బ్రహ్మవాక్కు. తిరుగులేదు. పూలమ్ముకునేవారు, పాలమ్ముకునేవారు, శ్రామికులు, ఆటో డ్రైవర్లు, విద్యావంతులు, ఉద్యోగులు, మేధావులు, తటస్థులు.. ప్రతి ఒక్కరినీ పలకరించండి. వివిధ రాజకీయ పార్టీలపై వారి అభిప్రాయం తెలుసుకోండి. వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుకున్నవారితో సంభాషించండి. ఇవన్నీ ప్రాథమికంగా ఓ అంచనాకు రావడానికి ఉపకరిస్తాయి. అదే సమయంలో, సామాజిక మాధ్యమాల్లో తారసపడే ప్రతి సమాచారమూ నిజమని భ్రమపడకండి. ఫేక్ న్యూస్, డీప్‌ఫేక్ వీడియోస్ విషయంలో జాగ్రత్తగా ఉండండి. విష ప్రచారాలు, నేలబారు భాషలు, విశ్వాసాల్ని కించపరిచే వక్రీకరణలు.. ఇలా భావ కాలుష్యాన్ని వెదజల్లే వెబ్‌సైట్లు, వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ బృందాలను సాధ్యమైనంత దూరం పెట్టండి. వినదగు నెవ్వరు చెప్పిన.. ఫార్ములాను పాటించండి. అంతిమ నిర్ణయం మీరే తీసుకోండి. అంతరాత్మ ప్రబోధం ప్రకారమే నడుచుకోండి.